తెలుగు జ్యోతి
అనుక్షణం జనం కోసం
జాతీయ దినపత్రిక


# మల్లాపూర్ ఎస్సీ వాడలో సొంత నిధులతో ఐమాక్స్ లైట్ల ప్రారంభించిన మాజీ ఎంపీపీ పిన్నింటి హరిత మధుసూదన్ రెడ్డి





**తెలుగు జ్యోతి న్యూస్ షాద్ నగర్ ప్రతినిధి ఆగస్టు 5**

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించి ప్రతి వీధిలో వెలుగులు నింపడమే తన లక్ష్యమని మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి అన్నారు.కొత్తూరు మండలంలోని మల్లాపూర్ గ్రామ ఎస్సీ వాడలో సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఐమాక్స్ లైట్లను మల్లాపూర్ మాజీ ఉపసర్పంచ్ పిన్నింటి హరిత మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండలంలోని పలు గ్రామాల్లో ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా సొంత నిధులతో ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో రాత్రి వేళల్లో ప్రజలు సురక్షితంగా సంచరించేలా మెరుగైన వెలుతురు అందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి, మీనాక్షి దశరథ్ నాయక్, ఉప సర్పంచ్‌లు రాములు గౌడ్, శంకర్ నాయక్, మాజీ సర్పంచ్ రవి నాయక్, కాట్న రాజు, వార్డు సభ్యులు పవిత్ర జయందర్ రెడ్డి, స్వాతి రాజేష్, జార్జి రెడ్డి, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ చిర్ర రాజు, చిర్ర సుధాకర్, చిర్ర దర్శన్, మాజీ ఎంపీటీసీ మోడీ దర్శన్, పెండ్లిమడుగు రాజు, కృష్ణ, శ్రీను, మోహన్ నాయక్, దర్శన్, అనిల్, వంశీ, శ్రీశైలం, జంగయ్య, శేఖర్ రెడ్డి, దయానంద రెడ్డి, భరత్ రెడ్డి, దామోదర్ రెడ్డి, పాపిరెడ్డి, భాను, పవన్, రఘు తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ యుగంలో సైబర్ భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత బోనకల్ కళాశాలలో సైబర్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్...





**అపరిచిత లింకులు క్లిక్ చేయకండి, ఓటీపీలు పంచకండి: సైబర్ మోసాలపై విద్యార్థులకు హెచ్చరిక...**

**బోనకల్లు,ఖమ్మం జిల్లా ఆగస్టు 05 తెలుగు జ్యోతి ప్రతినిధి:**

బోనకల్ నేటి ఆధునిక డిజిటల్ సమాజంలో స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్ మరియు సోషల్ మీడియా ప్రతి ఒక్కరి జీవితంలో నిత్య జీవిత భాగస్వాములుగా మారిపోయాయని, అయితే వీటి వాడకంతో పాటు సైబర్ నేరాలు కూడా అంతే వేగంగా పెరుగుతున్నాయని బోనకల్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ రామచంద్ర పేర్కొన్నారు. బోనకల్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి లింగంనేని నళిని శ్రీ అధ్యక్షతన విద్యార్థులకు సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.

**సైబర్ నేరాల రకాలు --**

**కానిస్టేబుల్ రామచంద్ర హెచ్చరిక...**

ఈ సందర్భంగా కానిస్టేబుల్ రామచంద్ర మాట్లాడుతూ, ఇంటర్నెట్ లేదా కంప్యూటర్ వ్యవస్థ ఆధారంగా జరిగే ప్రతి మోసాన్ని సైబర్ నేరంగా పరిగణిస్తారని వివరించారు.నేడు సమాజంలో ప్రధానంగా జరుగుతున్న సైబర్ మోసాలను విద్యార్థులకు వివరంగాత తెలియజేశారు.ఓటిపిడ బ్యాంక్ వివరాల అధికారులమని చెప్పి అకౌంట్ వివరాలు, ఓటిపిలు అడిగి డబ్బులు ఖాళీ చేయడం.? ఆకర్షణీయమైన మెసేజ్‌లు పంపి, ఆ లింకుల ద్వారా ఫోన్/బ్యాంక్ వివరాలు హ్యాక్ చేయడం. ఫేక్ ప్రొఫైల్స్ సృష్టించడం, అకౌంట్లు హ్యాక్ చేసి బ్లాక్‌మెయిల్ చేయడం.పార్ట్ టైమ్ ఉద్యోగాలు,ఆన్‌లైన్ గేమ్స్ పేరిట సులభంగా డబ్బు సంపాదించవచ్చని ఆశచూపి మోసగించడం. ?విద్యార్థులు ఇటువంటి మాయమాటల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

**నిర్లక్ష్యం వహిస్తే కుటుంబానికే నష్టం - కళాశాల ప్రిన్సిపాల్ నళిని శ్రీ...**

విద్యార్థులు తమ వ్యక్తిగత డిజిటల్ భద్రత పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆమె ముఖ్యంగా కొన్ని కీలక సూచనలు చేశారు.?రహస్య సమాచారం సురక్షితం ఏటీఎమ్ పిన్, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోకూడదు.సోషల్ మీడియాలో పరిచయం లేని వ్యక్తులతో వ్యక్తిగత ఫోటోలు, సమాచారాన్ని పంచుకోవడం ప్రమాదకరం. హెల్ప్‌లైన్ 1930 సైబర్ నేరం లేదా వేధింపులకు గురైతే భయపడకుండా వెంటనే బాధితులు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలి.?ఒక్క క్షణం చూపించే నిర్లక్ష్యం కుటుంబానికి తీవ్రమైన ఆర్థిక, మానసిక నష్టాన్ని కలిగిస్తుందని ఆమె హెచ్చరించారు.?

**హాజరైన అధ్యాపక బృందం...**

ఈ అవగాహన కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అంతోటి తిరుపతిరావు,అధ్యాపకులు జోనతాన్ బాబు,రాజేంద్ర కుమార్, లక్ష్మీకాంతం, పద్మావతి, రామకృష్ణ, రమేష్, రాజేంద్ర, ప్రియ కుమార్ రెడ్డి, మురళి కృష్ణ, యశోద, శాంతి ప్రియ, లైబ్రేరియన్ మోహన్, యుడిసి మదర్ సాహెబ్, జశ్వంత్, బుజ్జమ్మ, అరుణ మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# కొత్తూరు మున్సిపాలిటీలో ఎక్కడి చెత్త అక్కడే..!


**పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు.. దుర్వాసనతో ప్రజల అవస్థలు**

**చెత్త వాహనాలు రాక పేరుకుపోతున్న చెత్త కుప్పల**

**వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు**

**తెలుగు జ్యోతి న్యూస్ షాద్ నగర్ ప్రతినిధి ఆగస్టు 5**






కొత్తూరు మున్సిపాలిటీలో పారిశుధ్య వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందని కాలనీవాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛతకు పెద్దపీట వేస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు పూర్తిగా విరుద్ధంగా కనిపిస్తున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎక్కడ చూసినా చెత్త కుప్పలు, పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు, దుర్వాసనతో కాలనీలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయని వారు అంటున్నారు.మున్సిపాలిటీ పరిధిలోని అనేక కాలనీల్లో చెత్త సకాలంలో తొలగించకపోవడంతో వీధులన్నీ చెత్త కుప్పలతో నిండిపోయాయి. ఎక్కడ వేసిన చెత్త అక్కడే రోజుల తరబడి పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. అధికారులు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని, జీవీపీ పాయింట్లను తొలగిస్తున్నామని చెబుతున్నప్పటికీ, వాస్తవ పరిస్థితుల్లో మాత్రం ఎలాంటి మార్పు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా కొత్తూరు పోలీస్ స్టేషన్ కాలనీలో గత వారం రోజులుగా చెత్త సేకరణ వాహనాలు రాకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఇంటింటి చెత్తను ప్రజలు బయట వేయాల్సి వస్తుండటంతో వీధులన్నీ చెత్తతో నిండిపోయాయి. దాంతో ఈగలు, దోమలు విపరీతంగా పెరిగి చిన్నారులు, వృద్ధులు, మహిళలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని కాలనీవాసులు చెబుతున్నారు. అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కొత్తూరు రైల్వే స్టేషన్ రోడ్డులో డ్రైనేజీ నీరు రోడ్డుపైకి పొంగిపొర్లుతూ దుర్వాసన వెదజల్లుతోంది. మురుగునీరు రోడ్డుపై నిల్వ ఉండటంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. స్వచ్ఛత లోపంతో దోమలు, ఈగలు అధికంగా పెరిగి డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు వెంటనే ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి చెత్తను తొలగించడంతో పాటు డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని వారు కోరుతున్నారు. కొత్తూరు మున్సిపల్ కమిషనర్ తక్షణమే స్పందించి పోలీస్ స్టేషన్ కాలనీతో పాటు ఇతర ప్రాంతాల్లో చెత్త సేకరణను పునరుద్ధరించాలని, రైల్వే స్టేషన్ రోడ్డులో పొంగిపొర్లుతున్న డ్రైనేజీని వెంటనే శుభ్రం చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతున్న పారిశుధ్య సమస్యలపై నిర్లక్ష్యం వీడి అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# ?కేంద్ర బీజేపీ ప్రభుత్వం హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైంది: సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు...



**ముష్టికుంట్లలో "ప్రజాపోరుయాత్ర", "ఛలో ఢిల్లీ" ప్రచార గోడపత్రికల ఆవిష్కరణ...**

**ఆగస్టు 6 నుండి 13 వరకు "ప్రజాపోరుయాత్ర".. సెప్టెంబర్ 1న "ఛలో ఢిల్లీ"..**

**బోనకల్ ఖమ్మం జిల్లా ఆగస్టు 05 తెలుగు జ్యోతి ప్రతినిధి:**

బోనకల్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12 సంవత్సరాలు గడిచినా ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజలంతా ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు అన్నారు. బుధవారం మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో ఆగస్టు 6 నుంచి 13 వరకు నిర్వహించే ప్రజాపోరుయాత్ర, సెప్టెంబర్ 1న జరిగే "ఛలో ఢిల్లీ" కార్యక్రమాల ప్రచారంలో భాగంగా గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండు కోట్ల ఉద్యోగాలు, రైతుల ఆదాయం రెట్టింపు, ధరల నియంత్రణ వంటి హామీలు అమలు కాలేదని, నిరుద్యోగం, ధరల పెరుగుదల, ప్రైవేటీకరణ విధానాలతో సామాన్య ప్రజల జీవనం భారంగా మారిందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం, కార్మిక హక్కులను బలహీనపరచడం, తెలంగాణ విభజన హామీలను విస్మరించడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనమన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజాపోరుయాత్ర, "ఛలో ఢిల్లీ" కార్యక్రమాలను ప్రజలు, రైతులు, కార్మికులు, యువత, విద్యార్థులు పెద్దఎత్తున విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆకెన పవన్, కొంగర భాస్కరరావు, బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, యంగల గిరి తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ డీ ,ప్రేమానంద0 ను సన్మానించి పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలియజేసిన సీనియర్ డాక్టర్ పి విజయ్ కుమార్.





**తెలుగు జ్యోతి దినపత్రిక 5 ఆగస్టు సంగారెడ్డి ప్రతినిధి.**

సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి పట్టణంలో డీ ప్రేమానందం ను సన్మానించి పూల బోకే అందించిన డాక్టర్ పి విజయ్ కుమార్ సీనియర్ సర్జన్. ఈ మధ్యకాలంలో సామాజిక సేవలో పాల్గొని ,వివిధ కార్యక్రమాలు చేసిన, తెలంగాణ ఉద్యమకారులు డాక్టర్ డీ ప్రేమానందం ను సన్మానించి పూలబోకి అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. డాక్టర్ విజయ్ కుమార్ తో పాటు, పి ప్రవీణ్ కోతులాపూర్ సర్పంచ్, డి ప్రకాష్ ఆర్ టి సి ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ నాయకులు, నర్సింలు దళిత బహుజన నాయకులు, ఎం ఆర్ పి ఎస్ నాయకులు ఆనంద్, తదితరులు శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సన్మానించారు. డాక్టర్ డీ ప్రేమానందం మాట్లాడుతూ నేను సామాజిక కార్యకర్తగా( సోషల్ వర్కర్ గా) వివిధ ప్రజా సంఘాలలో పనిచేసిన సేవలను గుర్తించి, నాకు గౌరవ డాక్టరేట్ అవార్డు అందజేసిన డాక్టర్ ఆకుల రమేష్ కి మరియు డాక్టర్ చిన్నారెడ్డికి వారి సొసైటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా నాపై అభిమానంతో నన్ను సన్మానించి పూలబోకి అందించి శుభాకాంక్షలు తెలియజేసిన వారికి కూడా కృతజ్ఞతలు చేశారు.

# పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో "ఆషాడ మాసం సారె" సమర్పించిన జగ్గయ్యపేట మహిళలు...

**పెనుగంచిప్రోలు ఎన్టీఆర్ జిల్లా ఆగస్టు 05 తెలుగు జ్యోతి ప్రతినిధి:**



పెనుగంచిప్రోలు గ్రామంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ తిరుపతమ్మ అమ్మవారికి బుధవారం జగ్గయ్యపేట గ్రామ మహిళలు ఆషాఢ మాసం సందర్భంగా భక్తిశ్రద్ధలతో సారె సమర్పించారు.వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి సారెను అమ్మవారికి అందజేశారు.అనంతరం సారె తీసుకువచ్చిన వారికి వేద పండితుల ఆశీర్వచనం, అన్నప్రసాదం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో జంగం శ్రీనివాసరావు,టెంపుల్ ఇన్స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్, నవీన్, దేవస్థానం చైర్మన్ చుంచు రమేష్, దేవస్థానం మాజీ చైర్మన్ వాసిరెడ్డి బెనర్జీ, బొజ్జ సౌమ్య, తన్నీరు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలకు ఫుల్ స్టాప్...
# విద్యార్థులకు జీడిమెట్ల పోలీసుల అవగాహన

"సురక్షా కా తిరంగా"తో సైబర్ స్వతంత్ర తెలంగాణే లక్ష్యం
ఏసీపీ బాలగంగి రెడ్డి

తెలుగు జ్యోతి న్యూస్ జీడిమెట్ల:ఆగస్టు 5



సైబర్ నేరాలపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన పెంపొందించేందుకు "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" సైబర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా జీడిమెట్ల పోలీసులు బుధవారం చింతల్ ఐడీపీఎల్ ఎక్స్ రోడ్ సమీపంలోని ఎంపీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ప్రత్యేక సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆగస్టు నెల సైబర్ జాగృతి దివస్ సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం "సురక్షా కా తిరంగా -- టువార్డ్స్ ఎ సైబర్ ఇండిపెండెంట్ తెలంగాణ" అనే అంశంపై జరిగింది. చింతల్ పరిసర ప్రాంతాలకు చెందిన వివిధ ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలల నుంచి సుమారు 500 నుంచి 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ డివిజన్ ఏసీపీ బాలగంగి రెడ్డి, జీడిమెట్ల పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఏసీపీ బాలగంగి రెడ్డి, రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిజిటల్ అరెస్ట్ మోసాలు, పెట్టుబడి పేరుతో జరిగే మోసాలు, ఫిషింగ్, ఓటీపీ మోసాలు, క్యూ ఆర్ కోడ్ స్కామ్‌లు, సోషల్ మీడియా మోసాలు తదితర సైబర్ నేరాల గురించి వివరించారు. అపరిచితుల నుంచి వచ్చే కాల్స్, మెసేజ్‌లను నమ్మవద్దని, వ్యక్తిగత లేదా బ్యాంకింగ్ వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని సూచించారు. అలాగే "సురక్షా కా తిరంగా" ప్రచార కార్యక్రమం ప్రాముఖ్యతను వివరిస్తూ జాతీయ జెండాలోని మూడు రంగులు సూచించే సందేశాన్ని వివరించారు.

కాషాయం -- అప్రమత్తంగా ఉండాలి. తెలుపు -- సైబర్ అవగాహన పెంపొందించాలి. ఆకుపచ్చ -- సురక్షితమైన డిజిటల్ పద్ధతులను పాటించాలి. సైబర్ మోసాలకు గురైన వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫోన్ చేసి లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని, దీంతో మోసపోయిన నగదు నిలిపివేసి తిరిగి పొందే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సైబర్ భద్రతపై ప్రత్యేక వీడియోలను ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన ఇంటరాక్టివ్ సెషన్‌లో విద్యార్థులు సైబర్ భద్రతకు సంబంధించిన పలు సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. చివరగా జీడిమెట్ల పోలీసులు ప్రతి విద్యార్థి తన కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా సైబర్ అవగాహన కల్పించాలని, "బీ అలర్ట్ -- బీ అవేర్ -- బీ సేఫ్ అండ్ సెక్యూర్" అనే సందేశాన్ని పాటిస్తూ సైబర్ స్వతంత్ర తెలంగాణ నిర్మాణానికి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు

# మధిర యూనియన్ బ్యాంకులో
# షార్ట్ సర్క్యూట్.. రూ.70 లక్షల ఆస్తి నష్టం....



బ్యాంకులో నష్ట వివరాలను ఫైర్ సిబ్బందికి తెలుపుతున్న యూనియన్ బ్యాంక్ మేనేజర్ నవీన్..





మధిర ఖమ్మం జిల్లా ఆగస్టు 05 తెలుగు జ్యోతి ప్రతినిధి:

మధిరలోనే యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ లో బుధవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా 70 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. మధిర యూనియన్ బ్యాంకులో షార్ట్ సర్క్యూట్.. రూ. 70 లక్షల ఆస్తి నష్టం మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో బుధవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. బుధవారం బ్యాంకు నుండి కాలిన వాసన, పొగలు వ్యాపించడంతో గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖకు, బ్యాంకు అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న బ్యాంక్ సిబ్బంది, వెంటనే ఫైర్ ఆఫీసర్ బాలకృష్ణ తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని ఫైర్ ఇంజన్ తో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో క్యాష్ కౌంటర్లు, మిగిలిన కౌంటర్లో ఉన్న కంప్యూటర్లుతో పాటుగా ఫర్నిచర్ ఏసీలు తదితర వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారుగా 70 లక్షలు ఆస్తి నష్టం వాటిలిందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మధిర బ్రాంచ్ మేనేజర్ నవీన్ తెలిపారు.

# వర్షాకాల సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలన



నిజాంపేట్‌లో నీటి నిల్వ ప్రాంతాలు, రోడ్ల దెబ్బతినడం, నాలాల పరిస్థితిపై సంయుక్త తనిఖీ
పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని డిప్యూటీ కమిషనర్ హామీ
సీఎంఆర్ షాపింగ్ మాల్ సమీపంలో మ్యాన్‌హోల్‌ను క్యాచ్ పిట్‌గా మార్చిన అధికారులు

తెలుగుజ్యోతి శేరిలింగంపల్లి, ఆగస్టు 5:




నిజాంపేట్ ప్రాంతంలో వర్షాకాలంలో ఏర్పడుతున్న సమస్యల పరిష్కారానికి అధికారులు క్షేత్రస్థాయిలో సంయుక్తంగా పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ శ్రీ సాబెర్, డీఈ, ఏఈలతో కలిసి నిజాంపేట్‌లో నీటి నిల్వ ప్రాంతాలు, రోడ్లపై ఏర్పడిన గుంతలు, దెబ్బతిన్న రహదారులు, సమస్యాత్మక నాలా ప్రాంతాలను పరిశీలించారు. పరిశీలన సందర్భంగా పెండింగ్‌లో ఉన్న పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ హామీ ఇచ్చారు. అలాగే సీఎంఆర్ షాపింగ్ మాల్ సమీపంలో తరచూ నీరు నిలిచే ప్రాంతంలోని మ్యాన్‌హోల్ కవర్‌ను మార్చి, వర్షపు నీరు నిరంతరాయంగా వెళ్లేలా దానిని కొత్త క్యాచ్ పిట్‌గా అభివృద్ధి చేశారు. దీంతో ఆ ప్రాంతంలో నీటి నిల్వ సమస్య కొంత మేర తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## సంగారెడ్డిలో ఆగస్టు 8 శనివారం
## మాదిగ మహారాజుల బోనాలు.




తెలుగు జ్యోతి న్యూస్ 5 ఆగస్టు సంగారెడ్డి ప్రతినిధి.

సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి పట్టణంలో ఆగస్టు 8న శనివారం రోజున మాదిగ మహారాజుల బోనాలు ఉత్సవం నిర్వహించబడును. ఈ బోనాల ఉత్సవ కార్యక్రమానికి శ్రీశ్రీశ్రీ అంబాత్రేయ క్షేత్ర పీఠాధిపతి వ్యవస్థాపకులు, శ్రీ శ్రీశ్రీ ఆదిత్య పరా శ్రీ స్వామీజీకి ఆహ్వానించిన సంగారెడ్డి మాదిగ మహారాజుల బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు.

## కొరియర్ బాయ్ అవతారంలో
## ఘరానా చైన్ స్నాచర్ అరెస్ట్




డెలివరీ పేరుతో ఇంట్లోకి చొరబడి మహిళపై పెప్పర్ స్ప్రే దాడి
4 తులాల బంగారు మంగళసూత్రం అపహరణ -- నిందితుడి అరెస్ట్
సీసీటీవీ ఆధారాలతో ఏపీలో పట్టుకున్న మియాపూర్ పోలీసులు

తెలుగుజ్యోతి మియాపూర్, ఆగస్టు 05:

మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కొరియర్ బాయ్ వేషంలో వచ్చి మహిళపై పెప్పర్ స్ప్రే దాడి చేసి బంగారు మంగళసూత్రాన్ని అపహరించిన ఘరానా చైన్ స్నాచర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కొరియర్ డెలివరీ ఇస్తానంటూ బాధితురాలి ఇంటికి వచ్చిన నిందితుడు ఇంట్లోకి ప్రవేశించి, మహిళ ముఖంపై పెప్పర్ స్ప్రే చల్లి ఆమె మెడలో ఉన్న సుమారు 4 తులాల బంగారు మంగళసూత్రాన్ని అపహరించి పరారయ్యాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన మియాపూర్ పోలీసులు సీసీటీవీ దృశ్యాలు, ఇతర సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని గుర్తించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన 20 ఏళ్ల షేక్ ఖాజా అర్షాల్ అనే విద్యార్థిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి అపహరించిన 4 తులాల బంగారు గొలుసుతో పాటు నేరానికి ఉపయోగించిన ఆయుర్వేద మందుల ప్యాకెట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై గతంలో కూడా కనిగిరి పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదైనట్లు విచారణలో వెల్లడైంది. ఒంటరిగా నివసించే మహిళలను లక్ష్యంగా చేసుకుని, కొరియర్ ఏజెంట్ పేరుతో నమ్మించి పెప్పర్ స్ప్రే ఉపయోగించి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు హెచ్చరిక జారీ చేశారు. పరిచయం లేని వ్యక్తులు కొరియర్ డెలివరీ పేరుతో ఇంటి వద్దకు వచ్చినప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని, అనుమానం కలిగితే వెంటనే 100 లేదా 112కు సమాచారం అందించాలని సూచించారు. నిందితుడిని అరెస్ట్ చేసి కేసును ఛేదించడంలో విశేష ప్రతిభ కనబరిచిన మియాపూర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ విజయ్ నాయక్, ఎస్ఐ నరసింహారెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు ప్రేమ్ కుమార్, యాదయ్య, కానిస్టేబుళ్లు రూశ్వేశ్వర్, పూర్ణచందర్ తదితర క్రైమ్ సిబ్బందిని కూకట్‌పల్లి జోన్ డీసీపీ అభినందించారు.

## మహిళా విద్యార్థులకు సైబర్
## భద్రతపై అవగాహన కార్యక్రమం

మియాపూర్ పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ జాగృతి దివస్ నిర్వహణ
వి.ఆర్. రెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో 150 మంది విద్యార్థినుల పాల్గొనిక
ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన

తెలుగుజ్యోతి శేరిలింగంపల్లి, ఆగస్టు 5:



సైబర్ జాగృతి దివస్ సందర్భంగా మియాపూర్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో "సురక్షా కా తిరంగా" అంశంపై మియాపూర్‌లోని వి.ఆర్. రెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో సైబర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మియాపూర్ స్టేషన్ హౌస్ అధికారి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ విద్యార్థినులకు ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. లోన్ యాప్ మోసాలు, ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు, పెట్టుబడి పేరుతో జరిగే మోసాలు, క్రెడిట్--డెబిట్ కార్డు మోసాలు, యూపీఐ మరియు ఓటీపీ మోసాలు, ఫిషింగ్ దాడులు, ఇతర ఆన్‌లైన్ ఆర్థిక నేరాలపై జాగ్రత్తలు వివరించారు. వ్యక్తిగత, బ్యాంకు వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులు లేదా సందేశాలకు స్పందించవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే జాతీయ సైబర్ నేరాల సహాయ కేంద్రం 1930కు ఫోన్ చేయాలని లేదా జాతీయ సైబర్ నేరాల ఫిర్యాదు పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయాలని విద్యార్థినులకు తెలియజేశారు. విద్యార్థినులు కార్యక్రమానికి ఉత్సాహంగా స్పందించగా, డిజిటల్ ప్రపంచంలో బాధ్యతాయుతంగా, అప్రమత్తంగా ఉండే పౌరులుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని మియాపూర్ పోలీసులు తెలిపారు.

